కాంగ్రెస్ ఇచ్చింది ఉత్తుత్తి కరెంటే

ఇప్పుడు వైర్లు ముట్టుకుంటే కరెంట్ ఉందో లేదో తెలుస్తది • ఆ పార్టీ పేదల నేస్తంకాదు.. భస్మాసుర హస్తం: కేటీఆర్

- కాంగ్రెస్‌కు ఓటేస్తే దరిద్రం తెచ్చుకున్నట్టే
- 11 సార్లు గెలిపిస్తే ఏం చేసిండ్రని ఇప్పుడు ఒక్క చాన్స్ దానికి ఇవ్వాలె
- ఎవుసానికి 3 గంటల కరెంట్ చాలట.. 10 హెచ్‌పీ మోటర్లు వాడుతున్నరా?
- రాహుల్‌కు ఎద్దు, ఎవుసం తెలియదు
- మోదీ ప్రియమైన కాదు.. పిరమైన ప్రధాని
- మరోసారి బీఆర్ఎస్‌నే ఆశీర్వదించండి
- ఉప్పల్, ఎల్బీనగర్, యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడ రోడ్‌షోల్లో మంత్రి కే కల్వకుంట్ల తారకరామారావు

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

హైదరాబాద్ సిటీబ్యూరో/యాదాద్రి భువనగిరి, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)/మిర్యాలగూడ: కాంగ్రెస్ ఇచ్చింది ఉచిత కరెంట్ కాదని, ఉత్తుత్తి కరెంట్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కే తారక రామారావు అన్నారు. ఆ పార్టీ పాలనలో నిత్యం ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవని, మోటర్లు కాలిపోయేవని ధ్వజమెత్తారు. ఎప్పుడు కరెంట్ వస్తుందో.. ఎప్పుడు పోతదో తెలియదని, రైతులు రాత్రి వేళ పొలాల వద్ద పాము, తేలు కాట్లకు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, వలిగొండ, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఉప్పల్, ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, బండారి లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం మంత్రి కేటీఆర్ రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగిస్తూ.. 3 గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లు వాడితే సరిపోతుందని రేవంత్ మాట్లాడుతున్నారని, ఎవరికైనా 10 హెచ్‌పీ మోటర్లు ఉన్నాయా? అని అక్కడున్న రైతులను ప్రశ్నించారు. 3 గంటల కరెంట్ కావాలా.. 24 గంటల విద్యుత్తు కావాలా ఆలోచన చేయాలని సూచించారు.

11 సార్లు చాన్సిస్తే ఏంచేశారు?

కాంగ్రెస్ పేదల నేస్తం కాదని, వారిపాలిట భస్మాసుర హస్తం అని కేటీఆర్ ధ్వజమెత్తారు. హస్తం దరిద్రానికి నేస్తమని.. కాంగ్రెస్‌కు, రాహుల్‌కు ఎద్దు, ఎవుసం తెలియదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ దరిద్రం తెచ్చుకున్నట్టేనని ప్రజలను హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారని, ఆ పార్టీకి 11 సార్లు అవకాశమిస్తే ఏమీ చేయలేదని.. ఇప్పుడిస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 24 గంటల కరెంట్ ఎక్కడ ఇస్తున్నారని కాంగ్రెస్ నేతలు అడుగుతున్నారని.. ఉత్తమ్, కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క కోసం బస్సులు ఏర్పాటు చేస్తామని, వలిగొండ, యాదగిరిగుట్టలో కరెంటు వైర్లను ముట్టుకుంటే తెలుస్తుందని, రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుందని ఘాటుగా విమర్శించారు.

గాడిదకు గడ్డేసి.. ఆవుకు పాలు పిండుతరా?

వచ్చే నెల 3 తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక బ్రహ్మాండమైన పథకాలు అమలు చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు 200 పింఛన్ ఇవ్వలేని కాంగ్రెస్, ఇప్పుడు 4 వేలు ఇస్తామని డబ్బా కొడుతున్నారని మండిపడ్డారు. గాడిదకు గడ్డేసి.. ఆవుకు పాలు పిండితే వస్తాయా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలవి నరం లేని నాలుకలని, రైతుబంధు గురించి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి రాగానే రైతుబంధు సాయం ఏటా రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామని చెప్పారు. 18 ఏండ్లు నిండిన అమ్మాయిలు, కోడళ్లకు ప్రతినెలా రూ.3 వేల సాయం అందిస్తామని స్పష్టంచేశారు. అవ్వా తాతల ఆసరా పింఛన్ రూ.2016 నుంచి రూ.5 వేలు చేస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ బండ రూ.400కు ఇప్పిస్తామని, మిగతా రూ.800 ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. తెల్లరేషన్ కార్డు ఉన్నోళ్లందరికీ సన్న బియ్యం ఇస్తామని చెప్పారు. భూమిలేనోళ్లకు కూడా రైతుబీమా తరహాలో కేసీఆర్ బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

> ప్రజలు ఒకసారి ఆలోచించాలి. 2014 జూన్ 2కు ముందు, ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో గుర్తు తెచ్చుకోవాలి. నాడు పల్లెటూరులో ఎవరైనా చనిపోతే సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి 20 నిమిషాలు కరెంట్ ఇయ్యమని బతిమాలాడాల్సిన పరిస్థితి ఉండేది. ప్రతి ఇంటిలో ఇన్వర్టర్లు ఉండేవి. అప్పుడు అర్ధరాత్రి వచ్చే కరెంట్‌కు మోటర్లు పెట్టేందుకు వెళ్లి కరెంట్ షాక్‌కు గురై వేల మంది రైతన్నలు అసువులు బాశారు. వారి ఉసురు తగిలే కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోయింది.
> -మంత్రి కేటీఆర్

కాంగ్రెస్‌కు ఓటేస్తే అధోగతే..

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలంతా రాష్ట్ర పరిస్థితిని ఆలోచించి అభివృద్ధి చేసే బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని కోరారు. గతంలో కరెంట్ లేక, సాగు, తాగునీరు అందక రైతులు, ప్రజలు అరిగోస పడ్డారని గుర్తుచేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ మాట్లాడారు. ఎన్నికలు అనగానే ఆగం కావొద్దని, ఆలోచనతో ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు గంటలకొద్దీ బారులు దీరేవారని, తెలంగాణ వచ్చిన తరువాత ఆ పరిస్థితి పోయిందని స్పష్టంచేశారు. వారి పాలనలో తాగు, సాగు నీరు, కరెంట్ ఇవ్వని కాంగ్రెస్ సన్నాసులు.. ఈ రోజు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. 55 ఏండ్లు పాలించిన కాంగ్రెసోళ్లకు రైతులకు రైతుబంధు ఇవ్వాలనే ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ధరణి పోర్టల్ ఎత్తివేస్తానని, పట్వారీ విధానం తెస్తానని భట్టి విక్రమార్క పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. మళ్లీ పట్వారీ వ్యవస్థ కావాలా? అని ప్రజలను అడిగారు. వద్దని ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. అన్ని సంక్షేమ పథకాలు యథావిధిగా అందాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

యాదగిరిగుట్టలో అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. రోడ్‌షోకు హాజరైన ప్రజలు

టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనతో తక్షణమే జాబ్ క్యాలెండర్

కొంత మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది అఘాయిత్యాలతో ఉద్యోగ నియామాలకు ఆటంకం కలిగిందని, టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసి తక్షణమే జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ఉప్పల్, ఎల్బీనగర్ పరిధిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో కేటీఆర్ మాట్లాడారు. అనంతరం ఉప్పల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో పాల్గొని బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. తొమ్మిదిన్నరేండ్లలో తాగునీరు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థల తోపాటు, మూసీ సుందరీకరణ, స్కై వాక్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. హైదరాబాద్ నగర వాసుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా బీఆర్ఎస్ కృషి చేస్తున్నదని స్పష్టంచేశారు. ఐటీ కంపెనీలు నగరం నలువైపులా విస్తరించాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యం అవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తప్పుడు మాటలను జనాలు మోసపోవద్దన్నారు. మెరుగైన వసతులు, స్థిరమైన ప్రభుత్వంతోనే హైదరాబాద్ నగరానికి పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసుకోగలుగుతున్నామని, ఉచిత మంచి నీరు, అన్నపూర్ణ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, మెరుగైన శాంతి భద్రతలు అన్ని కూడా ప్రజల కళ్ల ముందర కనిపించే అభివృద్ధికి సూచికలని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తో మళ్లీ కల్లోలాలు, కరెంట్ కోతలు వస్తాయని, హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడుతుందని, ఆ పార్టీకి ఓటేసి మోసపోవదన్నారు. సుధీర్‌రెడ్డి లాంటి మంచి వ్యక్తులు ఎమ్మెల్యేగా ఉండగా, బఫూన్ లాంటి లీడర్లను ఓటేయవద్దని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, రామచంద్రారెడ్డి, అమరేందర్‌రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

> చేసింది చెప్పుకోలేని, చేసేది చెప్పుకొనే ధైర్యం లేని కాంగ్రెస్ నాయకులకు ఓటేయడం కంటే జనాల్లో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి. హైదరాబాద్ అభివృద్ధికి ఏం చేస్తామో తెలియని బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ఓటేయడం కంటే తొమ్మిదిన్నరేళ్లలో అన్ని వసతులు కల్పించిన కేసీఆర్‌ను గెలిపించుకోవాలి. గత రెండు ఎన్నికలల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే.. విద్యావంతులే ఓట్లు వేయడం లేదు. కాలనీలు, అపార్టుమెంట్లలో ఉండే జనాలు ముందుకు వచ్చి ప్రజల పక్షాన నిలిచే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి.
> -మంత్రి కేటీఆర్

లోకం పోకడ



రాష్ట్రంలో ఎమర్జెన్సీ గానీ తెస్తారేమోనని భయపడి పారిపోతున్నారు!

మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాలతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ పేర్కొన్నది. మంగళవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. ఉరుములతో జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని చెప్పింది.

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

ఈశాన్య దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.3డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.1 డిగ్రీలు, గాలిలో తేమ 41% నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	14.3°c	34.0°c
మెదక్	15.5°c	33.8°c
ఆదిలాబాద్	16.1°c	35.6°c
హైదరాబాద్	19.1°c	31.3°c
నిజామాబాద్	19.3°c	32.4 °c
నల్లగొండ	19.4°c	36.3°c
కరీంనగర్	20.0°c	32.0°c
మహబూబ్‌నగర్	20.6°c	32.6°c
వరంగల్	21.0°c	32.0°c
ఖమ్మం	23.0°c	32.0°c

నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎల్‌సీలో..

ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 295
- పోస్టులు: గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ
- ఎంపిక: గేట్-2023 స్కోర్ ద్వారా
- దరఖాస్తు, చివరితేదీ తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- వెబ్‌సైట్: www.nlcindia.in

ఇంజినీర్లు

ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 17
- పోస్టులు: ఇంజినీర్
- విభాగాలు: సివిల్, మెకానికల్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 22
- వెబ్‌సైట్: http://www.engineersindia.com

ఆర్‌సీబీలో...

రీజినల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ (ఆర్‌సీబీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 7
- పోస్టులు: రిజిస్ట్రార్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్, టెక్నికల్ అసిస్టెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 2
- వెబ్‌సైట్: www.rcb.res.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్ స్పెషల్ పాలిటీ, గ్రూప్స్/డీఎస్సీ స్పెషల్ సోషల్ స్టడీస్, భౌతిక శాస్త్రం కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

నిరుద్యోగుల భవితకు మాదీ భరోసా

ఉద్యోగార్థులకు త్వరలో మంచి రోజులు

ఎన్నికల ఫలితాలు వెలువడిన తెల్లారే అశోక్‌నగర్‌లో యువతతో సమావేశం

అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ • ఉద్యోగాల భర్తీని వేగవంతం చేస్తాం

గ్రూపు-2 పోస్టులను మరింత పెంచుతాం • కేసుల పరిష్కారానికి చర్యలు చేపడతాం

యువకుల ఆకాంక్షలకు అనుగుణంగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తాం

నిరుద్యోగులు, విద్యార్థులకు మంత్రి కేటీఆర్ హామీ

సోమవారం టీ హబ్‌లో విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు త్వరలో మంచి రోజులు రావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు భరోసా ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు (డిసెంబర్ 4న) ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువతతో ప్రత్యేకంగా సమావేశమవుతానని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అన్ని సమస్యలపై కూలంకషంగా చర్చిస్తానని హామీ ఇచ్చారు. అశోక్‌నగర్‌తోపాటు వివిధ యూనివర్సిటీల్లో ఉంటూ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న పలువురు విద్యార్థులు, నిరుద్యోగులు సోమవారం ఆయనను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పలు అంశాలపై వారితో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో తమ నిబద్ధతను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని, ముఖ్యంగా సంవత్సరానికి కనీసం 1,000 ఉద్యోగాలైనా కల్పించలేని కాంగ్రెస్ పార్టీకి అసలే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యువతకు లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన తాము అంతకు రెట్టింపు స్థాయిలో 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఇందులో ఇప్పటికే 1.62 లక్షలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా వివరించారు. గత పదేండ్లలో తెలంగాణ కంటే అధికంగా ఏ రాష్ట్రంలోనూ ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదన్న వాస్తవాలను యువత తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ నేతలు కేవలం రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారికి దమ్ముంటే కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గత పదేండ్లలో యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని సవాలు విసిరారు.

మంత్రి కేటీఆర్ మాటలు సంతోషకరం

ఉద్యోగాల భర్తీపై మంత్రి కేటీఆర్ చెప్పిన మాటలు సంతోషాన్ని కలిగించాయని ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చినప్పటికీ నియామక ప్రక్రియకు సంబంధించిన కొన్ని సాంకేతిక సమస్యలతో యువతలో కొంత ఆందోళన నెలకొన్నదని తెలిపారు. ఈ అంశాలపై మంత్రి కేటీఆర్‌తో తమ అభిప్రాయాలను, సూచనలను పంచుకోవడంతోపాటు మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఉద్యోగాల సంఖ్యను మరింత పెంచాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు.

ప్రైవేట్ ఉద్యోగిగా పదేండ్లు పనిచేశా: కేటీఆర్

పదేండ్లు ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేసిన అనుభవం తనకు ఉన్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఏ ఉద్యోగమైనా పూర్తిగా అర్థం చేసుకోగలనని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై విద్యార్థులకు, నిరుద్యోగులకు ఒక సోదరుడిగా భరోసా ఇస్తున్నానని, విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 60 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంతోపాటు గ్రూప్-2 పోస్టుల సంఖ్యను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు.